సాక్షి
ఏలూరు

శనివారం । 2 । నవంబర్ । 2024



వేడుకగా దీపావళి ఉత్సవం

దీపావళి పండుగ నాడు బాణసంచా వెలుగుల నడుమ ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్రవీధుల్లో ఊరేగారు. దీపావళి ఉత్సవం అట్టహాసంగా జరిగింది. 8లో ▸



బీచ్‌కి వెళ్దొద్దామా..

ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు అలలు.. కనువిందు చేసే సూర్యోదయ, సూర్యాస్తమయాలతో పేరుపాలెం మండలంలో బీచ్‌లు స్వాగతం పలుకుతున్నాయి. 8లో ▸



మహిళను రక్షించిన రైల్వే పోలీస్

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ రైలు కిందపడి పిల్లలతో సహా ఆత్మహత్యకు యత్నించగా రైల్వే సిబ్బంది అప్రమత్తతతో ఆమెను రక్షించారు. 8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ సన్నిధిలో ఉప లోకాయుక్త



ఉప లోకాయుక్త రజని దంపతులకు అమ్మవారి ఫొటోను అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త పి.రజని దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ వారికి ప్రసాదాలు, శేషవస్త్రం, అమ్మవారి ఫొటో అందజేశారు. డీఎస్పీ జయసూర్య, తహసీల్దార్ రాంబాబు ఉన్నారు.

విద్యుత్ మీటర్లు తొలగించడం దారుణం



వివరాలు తెలుసుకుంటున్న కేవీపీఎస్ నాయకులు

బుట్టాయగూడెం: బకాయిల పేరుతో దళితుల ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు తొలగించడం దుర్మార్గమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి అన్నారు. మండలంలో విద్యుత్ అధికారులు మీటర్లు పీకివేసిన దళితుల ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అని చెబుతూనే మరో వైపు మీటర్లు తొలగించడం దారుణమన్నారు. బాధ్యులపై అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ నిర్వహించాలన్నారు. విద్యుత్ మీటర్లు తొలగించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, మొగలి గంగరాజు, కె.కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో బదిలీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పలువురు ఏఈలను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దెందులూరు ఆపరేషన్స్ ఏఈ ఎం.రమేష్ బాబును ఉంగ్రాజవరం ఆపరేషన్స్ ఏఈగా, నిడమర్రు ఆపరేషన్స్ ఏఈ ఎస్.మురళీకృష్ణను వేలేరుపాడు ఆపరేషన్స్ ఏఈగా బదిలీ చేశారు.

దీపం-2 ప్రారంభం

చింతలపూడి: దీపం-2 పథకంలో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్ వద్ద దీపం-2 పథకం ప్రారంభ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిలిండర్‌కు సంబంధించి లబ్ధిదారులు ముందుగా నగదు చెల్లిస్తే 48 గంటల్లోపు తిరిగి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడారు. ఆర్డీఓ వాణి, నగర పంచాయతీ కమిషనర్ పావని, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో దీపం-2 కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిధుల స్వాహాపై విచారణ

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా వాస్తవమే నని ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఓ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 31న 'ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఆస్పత్రిలో కుంచె మురళీ తులసీదర్ అనే వ్యక్తి 2021 నుంచి పనిచేస్తున్నారని, ఇంతకు ముందు, ప్రస్తుత సూపరింటెండెంట్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఆరోగ్యశ్రీ నిధులు దారి మళ్లించారన్నారు. దీనిపై పాలకొల్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయ అధికారి (ఏలూరు) శుక్రవారం శాఖాపరమైన విచారణకు ఆదేశించారని ఆయన అన్నారు.

'అపార్'పై ఒత్తిడి తగదు

భీమవరం: విద్యార్థులందరికీ అపార్ ఐడీలను నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం దారుణమని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు ఐడీ నంబర్ క్రియేట్ చేసేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు.

పెన్షన్ల కోత.. పేదల వ్యథ

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో గద్దెనెక్కిన కూటమి నేతలు కుట్రలు చేస్తూనే ఉన్నారు. ప్రతి నెలా సామాజిక పింఛన్లను తొలగిస్తూనే.. కొత్త పెన్షన్‌లు ఇస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. కదలలేని అవ్వాతాతల పెన్షన్‌లకు సాకుల పేరుతో గండి కొడుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా మూడు నెలల్లో 3,099 పెన్షన్లు తొలగించారు. వీటికి మరణాలు, ఇతర కారణాలు చూపుతూ లబ్ధిదారుల ఉసురు పోసుకుంటున్నారు. ఇప్పటికే ఓ పక్క ఇంటింటికీ పింఛన్‌ను తొలగించి అధికారుల వద్దకే వెళ్లి పెన్షన్ తీసుకునే విధానానికి తెరదీసిన కూటమి సర్కారు.. మరోపక్క గుట్టుగా పెన్షన్‌లను రద్దు చేస్తోంది.

కోతలే కోతలు : ప్రతినెలా పింఛన్లను కోత విధిస్తున్నారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటామని చెబుతున్నా.. వాస్తవంగా ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇదిలా ఉండగా ప్రతినెలా పెన్షన్లను తగ్గిస్తూ ఇవన్నీ మరణాలంటూ అధికారులు చెబుతున్నారు. అలాగే పెన్షన్ల పంపిణీలోనూ కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. గత జగన్ సర్కారులో ప్రతినెలా 1 నుంచి 10వ తేదీ పింఛన్లను అందించేవారు. లబ్ధిదారుడు స్థానికంగా లేకపోయినా, ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నా వలంటీర్లే నేరుగా వారి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ములు అందించేవారు. అయితే ప్రస్తుత కూటమి సర్కారు 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తోంది. 2, 3 తేదీల్లో పింఛన్ కోసం వెళితే రద్దు చేస్తామంటూ లబ్ధిదారులను హెచ్చరిస్తోంది. అప్పటికీ పింఛన్ అందుకోకుంటే తిరిగి పెన్షన్ ఇచ్చేందుకు ఇబ్బంది పెడుతుందని పలువురు వాపోతున్నారు.

కూటమి కుట్రలు

- 3 నెలలు.. 3,099 పింఛన్ల రద్దు
- ప్రతినెలా వెయ్యి టార్గెట్
- కొత్త పెన్షన్ల ఊసేలేదు
- 1వ తేదీ తీసుకోకుంటే అంతే సంగతులు
- కూటమి సర్కారుపై ప్రజల ఆగ్రహం

జిల్లాలో పింఛన్ల తొలగింపు

నెల	లబ్ధిదారులు	రద్దు
ఆగస్టు	2,66,867	–
సెప్టెంబర్	2,65,992	875
అక్టోబర్	2,64,996	996
నవంబర్	2,63,768	1,228



వెయ్యికి తగ్గకుండా..

జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా 1,000 పింఛన్లు తొలగించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నెలలో 2,63,768 పెన్షన్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆగస్టులో 2,66,867 మందికి పెన్షన్‌లు అందించగా, సెప్టెంబర్‌లో 2,65,992 మందికి పెన్షన్లు అందించారు. అక్టోబర్‌లో 2,64,996 మందికి పెన్షన్‌లు అందించారు. ఈ లెక్కన సెప్టెంబర్‌లో 875, అక్టోబర్‌లో 996, ఈ నెలలో 1,228 పెన్షన్‌లను తొలగించారు.

నీటి మూటలా ఎన్నికల హామీ

ఎన్నికల హామీల్లో భాగంగా ఎస్టీలకు 45 ఏళ్లు, బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్‌లు అందిస్తానని కూటమి నేతలు ప్రచారం చేశారు. అయితే కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా పాతవి తొలగించడం లబ్ధిదారులను ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా పెన్షన్ల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెబుతున్నా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికే 5 వేల మందికి పైగా పెన్షన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

పంపిణీ ఇలా.. జిల్లాలో 2,63,768 మంది లబ్ధిదారులకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు 2,48,469 మందికి పింఛన్ సొమ్ములు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. శనివారం నూరు శాతం పంపిణీ పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. రైతు సేవ కేంద్రాల పరిధిలో కనీసం 20 శాతం తగ్గకుండా గోనె సంచులను నిల్వ ఉంచాలన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. ప్రతి కేంద్రం పరిధిలో పంట కోత షెడ్యూల్ తయారు చేసుకుని ఎప్పటికప్పుడు గోనె సంచులను రవాణా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎంఎల్‌ఓ పాల్గొన్నారు.

అసమర్థ పాలకుడు చంద్రబాబు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ మాత్రం సంక్షేమం అందించలేని అసమర్థ పాలకుడని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఘాటుగా విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళిని ప్రజలు అసంతృప్తిగా నిర్వహించుకోవడం బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా.. సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, జగన్ ప్రభుత్వంలో ధరలకు, కూటమి ప్రభుత్వంలో ధరలకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.4,800 కోట్ల పాత విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపడం దారుణమని అన్నారు. ఐదు నెలల్లోనే రూ.59 వేల కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, ఆరోగ్యశ్రీ పథకాన్ని అధోగతిపాలు చేశారని, 108 సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

మాటలు నమ్మి మోసపోయిన జనం

ఇసుక ఉచితమని చెప్పి ఇప్పుడు ఆరు యూనిట్లకు సుమారు రూ.15 వేలు, మూడు యూనిట్లకు రూ.11 వేలు వసూలు చేస్తున్నారని కొట్టు విమర్శించారు. ఇసుక కొనలేక నిర్మాణాలు నిలిచిపోతే కూలీలు పనులు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతల తేనె పూసిన కత్తి మాటలు విని ప్రజలు అధోగతి పాలయ్యారన్నారు. లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.99కే అని చెప్పి ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. బెల్టు షాపులకు వేలం పాటలు నిర్వహిస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్య నారాయణ ఎద్దేవా చేశారు.

పండుగ వేళ.. విషాద హేల

- ఏలూరులో పేలుడు ప్రమాదం
- నాటు ఉల్లి బాంబులు పేలి వ్యక్తి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- తీవ్రగాయాలతో నలుగురికి చికిత్స



ఏలూరులో పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్. చిత్రంలో పూర్తిగా కాలిపోయిన స్కూటీ



పేలుడు ధాటికి విరిగిన బాత్‌రూమ్ డోర్

ఏలూరు టౌన్: వెలుగులు నింపే దీపావళి వేళ తీవ్ర విషాదం నెలకొంది. నగరవాసులంతా సందడిగా గడుపుతున్న సమయంలో పేలుడు ప్రమాదం ఉలికిపాటుకు గురిచేసింది. స్కూటీపై నాటు ఉల్లిబాంబులు తీసుకువెళుతుండగా ఆకస్మికంగా విస్ఫోటనం జరిగింది.. దట్టమైన పొగ కమ్ముకోగా.. ఆ ప్రాంతంలో ఏం జరిగిందో తెలియక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్కూటీపై వెళుతున్న వ్యక్తి శరీరం నడుం కింది భాగం పేలుడు ధాటికి తెగిపడింది. స్కూటీ వెనుక కూర్చున్న వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. రోడ్డుపై నిలబడి మాట్లాడుకుంటున్న మరో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు తీవ్రతతో అర కిలోమీటరు మేర ఇళ్లలో సామగ్రి కదలగా.. సమీపంలోని పలు ఇళ్లల్లో కిటికీ అద్దాలు, బాత్‌రూమ్ డోర్లు విరిగిపోయాయి. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని, క్షతగాత్రులను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

మృతదేహం తునాతునకలు : గురువారం ఏలూరు వన్‌టౌన్ మారుతీనగర్‌కాలనీకి చెందిన దుర్గసి సుధాకర్, సత్యనారాయణపేటకి చెందిన తాబేలు సాయిరామ్ స్కూటీపై ముందు భాగంలో సంచిలో నాటు ఉల్లి బాంబులను భారీ సంఖ్యలో మూటకట్టి తీసుకువెళుతున్నారు. తూర్పువీధి గౌరీదేవి గుడి సమీపంలో వేగంగా వెళుతుండగా ఒక్కసారిగా ఉల్లిబాంబుల పేలుడు సంభవించింది. దీంతో స్కూటీ నడుపుతున్న సుధాకర్ నడుము కింది భాగంలోని రెండు కాళ్లు తెగిపోయాయి. ఒక కాలు రెండంతస్తుల భవనంపై, మరో కాలు సమీపంలోని భవనం బాత్‌రూమ్ వద్ద పడింది. వెనుక కూర్చున్న సాయిరామ్‌కు నడుం కిందిభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. అదే ప్రాంతంలో నిలబడి మాట్లాడుకుంటున్న మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మళ్ల పెద్దిరాజు చెయ్యికి తీవ్ర గాయాలు కాగా ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్‌కే ఖాదర్, గోపిశెట్టి సురేష్, ఎస్.సత్యనారాయణ, శ్రీనివాస్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బొడ్డేటి సతీష్, పఠాన్ ఖాన్ అనే యువకుల చెవుల్లో హోరు రావటంతో రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మారుతీనగర్‌లో విషాదం

మృతుడు సుధాకర్ భార్య జాహ్నవి నాలుగు నెలల గర్భిణి కాగా మారుతీనగర్ కాలనీలోని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాణసంచా సామాగ్రి వేరొకరికి ఇవ్వడానికి వెళుతూ ఇలా ప్రాణాలు పోగొట్టుకోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూటీ వెనుక ఉన్న సాయిరామ్‌కు నడుం కింది భాగంలో తీవ్రగాయాలు కాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

ఎస్పీ ప్రత్యేక దర్యాప్తు : ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ పరిశీలించారు. 150 ప్యాకెట్ల నాటు ఉల్లి బాంబులు ఒక పాలథీన్ బస్తాలో కట్టి స్కూటీ ముందు భాగంలో పెట్టి తీసుకువెళుతున్నట్టు గుర్తించారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్, అమరావతి నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఏలూరు, పరిసర ప్రాంతాల్లో బాణాసంచా తయారీకి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు ఉన్నాయా ? అన్నది సందేహంగా మారింది. నాటు ఉల్లిబాంబులు ఎవరు తయారు చేస్తున్నారు ? అనేది తెలియాల్సి ఉంది. పైగా పరిమితికి మించి పెద్ద సైజులో ఉల్లి బాంబులను చుట్టారనీ, వాటిలో బీబీ చిప్స్ వాడినట్టు తెలుస్తోంది.

బాధితులకు అండగా ఉంటాం

బాణసంచా పేలుడులో మృతుడు సుధాకర్ కుటుంబాన్ని మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. మట్టి ఖర్చులు నిమిత్తం రూ.15 వేలు, కార్పొరేషన్ నుంచి రూ.2 లక్షలు, పార్టీ తరపున రూ.లక్ష, సుధాకర్ కుటుంబసభ్యుల్లో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరిశీలించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్ ఉన్నారు.

8 నుంచి సీపీఎం ప్రజాపోరు

భీమవరం: అధిక ధరలు, నిరుద్యోగం, అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్ చెప్పారు. శుక్రవారం భీ మవరంలో చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14న ఎంపీడీఓ కార్యాలయాలు, 15న కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ ఇసుక కొరత, మద్యం షాపులు, విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు, పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

నైపుణ్య కోర్సులతో భవిత

పాలకొల్లు అర్బన్: సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల పురోగతిని తెలుసుకున్నారు.

● ఏడి పింఛన్



ఏలూరు 40వ డివిజన్ సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు




పెంటపాడు మండలం ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురుచూస్తూ..

సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా ఏదో ఒక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. శుక్రవారం ఉదయం గంటలోనే సాంకేతిక సమస్యతో యాప్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీశారు. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు అక్కడే పడిగాపులు కాశారు. గత జగన్ పాలనలో వలంటీర్ల ద్వారా వేకువజామునే పింఛన్లు అందేవని గుర్తు చేసుకున్నారు.


– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, పెంటపాడు


చటాకాయలో అరాచకం

- చేతబడి నెపంతో ముగ్గురిపై దాడి
- స్తంభానికి కట్టి పైశాచికానందం
- కొల్లేరు గ్రామాల్లో సమాంతర పాలన
- పంచాయితీల మాటున దారుణాలు



రక్షణ కల్పించాలంటున్న రఘు దంపతులు





చికిత్స పొందుతున్న మోరు రాంబాబు, ధనుంజయ

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో మూఢనమ్మకాల మాటున అరాచకాలు సాగుతున్నాయి. ప్రభుత్వానికి సమాంతరంగా పెద్దల మాటున పంచాయితీలు కొనసాగుతున్నాయి. కై కలూరు మండలం చటాకాయ గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో ముగ్గురిని చేతబడి నెపంతో స్తంభాలకు కట్టి 18 మంది కర్రలతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ ఉప సర్పంచ్ భర్త ఘంటసాల చినసుబ్బరాజుకు నీటి కాల్వపై కాపలా ఉండే సైదు రఘునకు నెల రోజుల క్రితం నీటి తూముల విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న గ్రామంలో పెద్దల వద్ద సుబ్బరాజు పంచాయితీ పెట్టి రఘు చేతబడులు చేస్తున్నాడని ఆరోపించాడు. దీంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రఘును స్తంభానికి కట్టి కర్రలతో చితకబాదారు. ఆ సమయంలో రఘు భార్య మంగతాయారు అడ్డు రాగా ఆమెనూ ఈడ్చిపడేశారు. పెట్రోలు పోసి తగలబెడతామని బెదిరించడంతో రఘు ప్రాణభయంతో చేతబడిలో తనతో పాటు మోరు రాంబాబు, జయమంగళ ధనుంజయ, మరో ఏడుగురు ఉన్నారని చెప్పాడు. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. దీంతో ఆగ్రహించిన పెద్దలు రఘుతో పాటు రాంబాబు, ధనుంజయను స్తంభాలకు కట్టి అదేరోజు రాత్రి 8 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు చిత్రహింసలకు గురిచేశారు. తీవ్రగాయాలైన రాంబాబు, ధనుంజయ ఏలూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా.. రఘు ఈనెల 26న భార్యను తీసుకుని ద్విచక్రవాహనంపై పారిపోయాడు. సీఎం చంద్రబాబు నివాసం, సచివాలయం, మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఏలూరు ఎస్పీ శివకిషోర్ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. అనంతరం సైదు రఘు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి జరిగిన విషయాన్ని కైకలూరు పోలీసులకు చెప్పాడు. దీంతో చటాకాయ గ్రామస్తులు ఘంటసాల చినసుబ్బరాజు, దేశింగిరాజు, కుటుంబరావు, ముంగర గంగాధరరావు, బలే చంద్రయ్య, శ్రీవేంకటేశ్వర్లుపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 29న కేసు నమోదు చేశారు.

రక్షణ కల్పించాలని వినతి

తమకు గ్రామంలో రక్షణ లేదని, రాజీ ప్రయత్నాలకు పెద్దలు వస్తున్నారని, తమకు హాని తలపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితులు రఘు, మంగతాయారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో ఉన్న రాంబాబు, ధనుంజయ వైద్యం ఖర్చులు భరిస్తామన్న గ్రామ పెద్దలు ఇప్పుడు తమకు సంబంధం లేదని అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏలూరు ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య రిపోర్టులు కీలకంగా మారాయని, చటాకాయ గ్రామంలో పోలీసు అధికారులు రాత్రి నిద్ర చేసి పెద్దలతో మాట్లాడారని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. తప్పు చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందని ఆయన అన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సాయంకాలార్చన సమయంలో మార్పు

ద్వారకాతిరుమల: వృశ్చిక సంక్రమణం (శీతాకాలం) ప్రారంభం కావడంతో శ్రీవారి సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 3 నుంచి మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినవెంకన్నకు సాధారణంగా ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే సాయంకాలార్చన కాలాన్ని శీతాకాలం కారణంగా సాయంత్రం 5 నుంచి 6.30 గంటలకు మార్పు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులకు సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీవారి దర్శనం లభిస్తుందని, మేష సంక్రమణ వరకు ఈ సమయం కొనసాగుతుందని వివరించారు. ఈ మార్పును భక్తులు గమనించాలని కోరారు.

తెలంగాణ మద్యం సీజ్

వేలేరుపాడు: తెలంగాణ నుంచి వేలేరుపాడు మండలానికి ఆటోలో మద్యం తరలిస్తుండగా పోలీసులు గురువారం బండలబోరు గ్రామ సమీపంలో పట్టుకున్నారు. వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట గ్రామానికి చెందిన మిరియాల నవీన్, కారం మంగరాజు, సోడే రాము ఆటోలో 12 బీర్లు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.1920 ఉంటుందని, ఆటోను స్వాధీనం చేసుకుని, నిందితులు ముగ్గురిపైనా కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ డానియేల్ తెలిపారు.

బీచ్‌కి వెళ్లొద్దామా..

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- పర్యాటకులను స్వాగతిస్తున్న పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు


పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి (ఫైల్)

మొగల్తూరు: ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు అలలు.. కనువిందు చేసే సూర్యోదయ, సూర్యాస్తమయాలు.. రివ్వున వీచే గాలులు, సరుగుడు, కొబ్బరి తోటల అందాలతో బీచ్‌లు పర్యాటకులకు స్వాగతం పలుకుతున్నాయి. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడనున్నాయి. నిత్యం వందలాది మంది పర్యాటకులు బీచ్‌లకు వస్తుంటారు. ఇక ఆది, బుధవారాల్లో వేలాది మంది బీచ్‌లను సందర్శిస్తుంటారు.

ఇలా చేరుకోవచ్చు

భీమవరం నుంచి వచ్చే పర్యాటకులు వెంప, వారతిప్ప, ముత్యాలపల్లి పేరుపాలెం మీదుగా బీచ్‌లకు చేరుకోవచ్చు. నరసాపురం నుంచి వచ్చే పర్యాటకులు సీతారాంపురం, రామన్నపాలెం, పసలదీవి, తూర్పుతాళ్లు మీదుగా బీచ్‌లకు రావచ్చు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆటోలు, బస్సులు, లారీలు, కార్లలో సందర్శకులు బీచ్‌లకు తరలివస్తారు.

టోల్‌గేట్ వసూలు రద్దు

బీచ్‌లకు వచ్చే పర్యాటకుల వాహనాల నుంచి టోల్‌గేట్ వసూలు రద్దు చేస్తున్నట్టు ఎంపీడీఓ త్రిశూల పాణి తెలిపారు. ఈ ఏడాది బీచ్‌లకు వచ్చే పర్యాటకుల వాహనాల నుంచి టోల్‌గేట్ వసూలు చేయరాదని అధికారులు ఆదేశించినట్లు చెప్పారు.

ప్రత్యేకతలు

కార్తీక విహారానికి తరలివచ్చే పర్యాటకులకు (దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన) కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లు స్వాగతం పలుకుతున్నాయి. ప్రకృతి అందాలతో పాటు మత సామరస్యాలకు ప్రతీకగా ఇక్కడ ఆలయాలు నిలుస్తున్నాయి. ఆలయాలు సందర్శకులను భక్తి పారవశ్యంలోకి తీసుకువెళ్తాయి.



కేపీపాలెం బీచ్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ కాంస్య విగ్రహం, టూరిజం శాఖ రిసార్ట్స్

- కేపీ పాలెం బీచ్ ప్రాంతంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్‌సీఎం మిషనరీ సంస్థ వేళాంకణి మాత ఆలయాన్ని సుందరంగా నిర్మించింది. ప్రతి ఏటా ఏప్రిల్‌లో వేళాంకణి మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.
- సముద్రం నుంచి కొట్టుకొచ్చిన వేంకటేశ్వరస్వామి విగ్రహానికి స్థానికులు ఆలయం నిర్మించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వేంకటేశ్వరస్వామి, పాండురంగస్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు.
- పేరుపాలెం సౌత్ శివారున సముద్రం – ఉప్పుటేరు కలిసే ప్రాంతాన్ని సీ మౌత్ అంటారు. దీనిని మోళ్లపర్రు బీచ్‌గా, కనకదుర్గ బీచ్‌గా పిలుస్తారు. ఈ బీచ్‌లో మరో విశేషమేమిటంటే రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదిగా 54 అడుగుల అభయాంజనేయ విగ్రహం చూపరులను కట్టిపడేస్తుంది. దీంతో పాటు మత్స్యనారాయణ స్వామి, షిర్డీ సాయిబాబా, పాండురంగ స్వామి ఆలయాలున్నాయి.
- టూరిజం శాఖ ఆధ్వర్యంలో మోళ్ల బీచ్‌లో రిసార్ట్స్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాక ప్రైవేటు వ్యక్తులు కూడా రిసార్ట్స్ ఏర్పాటు చేశారు.

బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం



బీచ్‌ల సందర్శనానికి వచ్చే పర్యాటకుల దృష్ట్యా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. బారికేడ్లు దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లను, సిబ్బందిని నియమిస్తున్నాం. మద్యం తాగిన వారిని బీచ్ ప్రాంతంలోకి రాకుండా కట్టడి చేస్తాం. తీరం పొడవునా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. సందర్శకులు తమ వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులకు సహకరించాలి.

– దుర్గాప్రసాద్, నరసాపురం రూరల్ సీఐ

పేరుపాలెం బీచ్‌లో మృత్యుఘంటికలు

నరసాపురం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన ప్రాంతం పేరుపాలెం బీచ్. ఈ బీచ్‌లో గత దశాబ్దన్నర కాలంలో 200 మంది వరకు ప్రమాదవశాత్తు మృతి చెందారు. వీరంతా యువకులే. రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన ఈ బీచ్ శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభంతో పర్యాటకులతో కళకళలాడనుంది. ఈ నేపథ్యంలో బీచ్‌లో భద్రతపై దృష్టిపెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. కార్తీకమాసం నెలరోజులో సుమారు 3 లక్షలు మంది ఈ బీచ్‌ను సందర్శిస్తుంటారు.

అండర్ కరెంట్!

పేరుపాలెం, కేపీపాలెం, మోళ్లపర్రు బీచ్‌ల్లో తరచూ ప్రమాదాలే. ఈ ప్రాంతంలో సముద్రంలో గుంటలు, గుంటలుగా ఉంటాయని, దీంతో అలలు పెద్దపెద్దగా వచ్చినప్పుడు కాళ్ల కింద ఇసుక విపరీతంగా కోతకు గురవుతుంది. దీనినే నిపుణులు అండర్ కరెంట్‌గా పేర్కొంటారు. కాళ్ల కింద ఇసుక కోతకు గురైనప్పుడు సముద్రంలో ఉన్నవారు తమ శరీరంపై నియంత్రణను కోల్పోతారు. అలలకు కొట్టుకుపోతారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉంటే ప్రాణాలపై ఆశలు వదులు కోవాల్సిందే. 2013లో అయితే నాటి సబ్‌కలెక్టర్ రొనాల్డ్‌రాజ్ పేరుపాలెం బీచ్‌ను మూసేయాని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేస్తారా?

గత ఐదేళ్లలో బెల్ట్‌షాపులు లేకపోవడంతో పేరుపాలెంబీచ్ వద్ద మద్యం అందుబాటులో ఉండేదికాదు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం తీరగ్రామాలను మొత్తం బెల్ట్‌షాపులతో నింపేసింది. ఈ ఏడాది బీచ్ మొత్తం మద్యం ఏరులై పారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనన్న గుబులు ప్రజలను వెంటాడుతోంది. బీచ్‌లో మద్యం సేవించడం, పేకాట సర్వసాధారణమయ్యాయి. బీచ్‌కు వచ్చే ప్రేమజంటలను బెదిరించి, వారి నుంచి బంగారు వస్తువులను కాజేసే ముఠాల ఆగడాలు అనేకం గతంలో వెలుగుచూశాయి. ఈ ముఠాల ఆగడాలు మరింత పెరిగే అవకాశం ఉంది. బీచ్‌లో అసాంఘిక చర్యలకు అడుకట్ట వేస్తారా? మద్యం మత్తు ధరిచేరకుండా చేస్తారా? అనేది చూడాలి. రెండేళ్ల క్రితం రెవెన్యూ, పోలీసు శాఖలు బీచ్‌లో డేంజర్‌జోన్లు సూచిస్తూ హోర్డింగ్స్ ఏర్పాటు చేశాయి. ఇప్పుడూ అదీలేదు.


యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న స్నేహితులు (ఫైల్)

తస్మాత్ జాగ్రత్త

కేపీ పాలెం బీచ్‌లో స్నానాలకు దిగి గల్లంతైన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా కార్తీకమాసం నెల రోజులపాటు తీరం నుంచి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాటిని దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లను, పోలీసులను నియమిస్తారు. సముద్ర స్నానానికి దిగే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పరిహారం కూడా ఉండదు

సముద్రంలో గత పదేళ్లలో ఇప్పటి వరకు 28 మంది మృతదేహాలు లభ్యం కాలేదు. మృతుల విషయంలో పోలీసులు 174 సెక్షన్ క్రింద, అనుమానాస్పద మృతి కేసు నమోదు చేస్తారు. బీచ్‌లో చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం కూడా లభించదు. మృతదేహాలు లభ్యంకాకపోతే ఇన్సూరెన్సులు వంటి సదుపాయాలు కూడా వర్తించవు.

శ్రీవారి సేవలో దేవదాయ శాఖ కమిషనర్


దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు శ్రీవారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ శుక్రవారం ఉదయం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈఓ చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

వేడుకగా శ్రీవారికి దీపావళి ఉత్సవం


శ్రీవారి వాహనం ముందు బాణసంచా వెలుగులు

ద్వారకాతిరుమల: చీకట్లను పారద్రోలే దీపావళి పండుగ నాడు బాణసంచా వెలుగుల నడుమ ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్రవీధుల్లో ఊరేగారు. స్వామివారి వాహనం ముందు భక్తులు పెద్ద ఎత్తున బాణసంచాను కాల్చి తమ భక్తిప్రపత్తులను చాటారు. ఏటా క్షేత్రంలో దీపావళి ఉత్సవాన్ని అట్టహాసంగా జరపడం సంప్రదాయంగా వస్తోంది. అయితే పండుగ తిథి తగులు, మిగులు రావడంతో శ్రీవారి దేవస్థానం దీపావళిని శుక్రవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించింది. ముందుగా ఆలయాన్ని దీపాలతో విశేషంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను తోళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. స్వామివారి వాహనం క్షేత్ర వీధులకు పయనమవ్వగా, వాహనం ముందు, ప్రధాన రాజగోపురం మెట్ల దారిలో పెద్ద ఎత్తున బాణసంచా వెలిగించారు. శ్రీవారి గ్రామోత్సవం భక్తులకు కనువిందు చేసింది.

మహిళను రక్షించిన రైల్వే పోలీస్


రైల్వే పోలీసులు రక్షించిన మహిళ

ఏలూరు టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఒక మహిళ పిల్లలతో సహా రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ వెంటనే తమ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో మహిళను రక్షించారు. ఏలూరు కోడేలు ప్రాంతానికి చెందిన మెండెం కావ్య, భర్త నాగవీరబాబులకు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ కలహాలతో కావ్య తన ముగ్గురి బిడ్డలతో కలిసి గురువారం ఏలూరు రైల్వేస్టేషన్‌కు వచ్చింది. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి చనిపోవాలని ప్రయత్నిస్తుండగా ఆమెను రైల్వే పోలీసులు అడ్డుకుని రక్షించారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాధితురాలు కావ్య, ముగ్గురు పిల్లలను ఆమె తల్లి వానపల్లి దేవికి అప్పగించారు.

బేకరీలో అగ్ని ప్రమాదం

నూజివీడు: పట్టణంలోని బస్టాండు సెంటర్‌లో గురువారం రాత్రి లిఖిత అయ్యంగార్ బేకరీలో అగ్నిప్రమాదం సంభవించింది. బేకరీని రాత్రి 10.30 గంటలకు మూసేసి యజమాని, వర్కర్లు ఇంటికి వెళ్లిపోగా, 11.15 గంటల సమయంలో లోపలి నుంచి పొగ వస్తుండటంతో స్థానికులు బిల్డింగ్ యజమానికి సమాచారమిచ్చారు. యజమాని హుటాహుటిన అక్కడికి చేరుకొని షాపు నిర్వాహకుడికి తెలిపారు. నిర్వాహకుడు వచ్చే సరికి దుకాణమంతా అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకున్న సీఐ పి.సత్య శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొన్నారు. కొద్దిసేపటికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఫ్రిజ్‌లు, కౌంటర్లు, ఫర్నీచర్, బేకరీ ఐటమ్స్ కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలకు పైగానే నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు.

చిట్టీల పేరుతో రూ.3 కోట్లకు టోకరా

చింతలపూడి: చింతలపూడిలో చిట్టీల పేరుతో ప్రజలు మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. సుమారు రూ.3 కోట్లు వసూలు చేసి చిట్టీల నిర్వాహకుడు వెంకట సుబ్బారావు ఉడాయించాడు. దీంతో బాధితులు గురువారం సీఐ రవీంద్రనాయక్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టామని ఎస్సై కుటుంబరావు తెలిపారు. సుబ్బారావు గత కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. స్థానికులు సుబ్బారావును నమ్మి చిట్టీలు కట్టారు. సమయం దాటి పోయినా చిట్టీలు పాడుకున్న వారికి సొమ్ము రేపిస్తాను, ఎల్లుండిస్తాను అని చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. చివరకు సుబ్బారావు కనిపించకుండా పోవడంతో చిట్టీలు కట్టిన వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.